నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
15 హైదరాబాద్, బుధవారం 6 మార్చి 2024 SIDDIPET


సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

జనసమీకరణలో బీజేపీ నేతల విఫలం
అడుగడుగునా తనిఖీలతో ప్రజలు బేజారు
ప్రధాని ప్రసంగంలో అభివృద్ధి ప్రస్తావన.. జోష్ నింపిన స్పీచ్
రామమందిరం ప్రస్తావనతో మార్మోగిన జైశ్రీరాం నినాదాలు



సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు నుంచి ఇల్లంతకుంటకు వెళ్లే రహదారి


సభా వేదికపై ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు తదితరులు

# ప్రధాని సభకు మిశ్రమ స్పందన

పటాన్‌చెరు/ అమీన్‌పూర్/ బొల్లారం, మార్చి 5: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలోని పటేల్‌గూడ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన బీజేపీ విజయ సంకల్ప సభకు మిశ్రమ స్పందన వచ్చింది. ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్రమోదీ పాల్గొని మాట్లాడారు. ప్రధాన మోదీ ప్రసంగం సందర్భంగా ప్రజలు, పార్టీ నాయకులు, యువకులు మోదీ మోదీ అంటూపెద్ద నినాదాలు చేశారు. ప్రధాని మోదీ విజయ సంకల్పయాత్ర సభను లక్ష మందితో నిర్వహిస్తామని బీజేపీ నేతలు ప్రచారం చేశారు. తీరా ఏర్పాట్లు మాత్రం ఆ స్థాయిలో లేవు. ప్రధాని మోదీ ప్రసంగం అందరినీ ఆకట్టుకున్నా, ఆ స్థాయిలో ప్రజలు రాకపోవడంతో బీజేపీ నేతల్లో నిరాశ కనిపించింది. ఒకవైపు ప్రధాని ఒక్కో మాటకు సభికులు కేరింతలు కొట్టారు. మరోపక్క వెనుక భాగంలో వేసిన కుర్చీలు ఖాళీగా ఉండడం బీజేపీ నాయకులకు మింగుడు పడలేదు. వచ్చిన ప్రజలు ప్రధాని ప్రస్తావించిన అంశాలపై స్పందించారు. ఆర్టికల్ 370, రామమందిరం ప్రస్తావన వచ్చిన సమయంలో బీజేపీ వర్గాల్లో జోష్ కనిపించింది. జైశ్రీరాం నినాదాలతో యువకులు నృత్యాలు చేశారు.

## పోలీసులపై రఘునందన్‌రావు ఆగ్రహం...

సభకు వస్తున్న వారిని పోలీసులు అడ్డుకుంటున్నారని బీజేపీ దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు పలుమార్లు ఆరోపించారు. తెలంగాణ పోలీసులు ఈ విధంగా అడ్డుకోవడం తగదని వేదికపై నుంచి ఆయన పేర్కొన్నారు. జీఎమ్మార్ ఫంక్షన్‌హాల్ వద్ద, కిష్టారెడ్డిపేట రూట్‌లో, ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డుపై పోలీసుల తీరుతో బీజేపీ కార్యకర్తలు, ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు భద్రతా చర్యల పేరిట ప్రజలకు తాగునీటి బాటిల్స్, పెన్నులు సైతం తీసుకెళ్లకుండా అడ్డుకున్నారు. బహిరంగ సభలోనూ తీవ్రమైన ఆంక్షలు పెట్టడంతో సభకు వచ్చిన వారు చాలామంది వెనుదిరిగినట్టు బీజేపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. పోలీసుల తీరుతో ప్రజలు సరైన సమయానికి వేదిక వద్దకు రాలేకపోయారని బీజేపీ నాయకులు ఆరోపించారు. జన సమీకరణలో విఫలం కావడంతో జిల్లా నాయకత్వంపై రాష్ట్ర నాయకత్వం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడారు. సభలో ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రధాని మోదీ సభలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

# దారి మళ్లింది..!

ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు రహదారుల నిధులు రద్దు
జీవో 305ను విడుదల
కేసీఆర్ మంజూరు చేసిన రోడ్లను రద్దుచేసిన రేవంత్ సర్కారు
చిన్నకోడూరు నుంచి ఇల్లంతకుంట వరకు ఫోర్‌లైన్ రోడ్డుకు గ్రహణం
ఇక్కడి నిధులు ఇతర జిల్లాలకు మళ్లింపు
నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు తరలించుకు పోయిన ఆర్అండ్‌బీశాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి
కాంగ్రెస్ సర్కారు తీరుపై మండిపడుతున్న ప్రజలు

సిద్దిపేట, మార్చి 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్‌కు పట్టున్న ఉమ్మడి మెదక్ జిల్లాపై రేవంత్‌రెడ్డి సర్కారు కక్షసాధింపులకు పాల్పడుతున్నది. కేసీఆర్ హయాంలో మంజూ రు చేసిన పలురోడ్ల అభివృద్ధి పనులను రద్దు చేయడంతోపాటు నిధులను ఇతర జిల్లాలకు మళ్లించింది. దీంతో జిల్లా ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. కేసీఆర్ ప్రభుత్వం ఎండీఆర్ ప్లాన్ కింద ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణాలకు నిధులు కేటాయించింది. తాజాగా ఆ నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేస్తూ జీవో 305ను ఫిబ్రవరి 24న జారీచేసింది. నిధులన్నీ రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన సొంత జిల్లా నల్లగొండతో పాటు సూర్యాపేట తరలించుకుపోయారు. దీంతో కాంగ్రెస్ సర్కారు తీరుపై ప్రజలు మండిపడుతున్నారు.

### జిల్లాలోని రహదారులు ...

సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గంలోని పీడబ్ల్యూ రోడ్డు నుంచి కొల్గూరు మీదుగా అహ్మదీపూర్ (0/0 నుంచి 4/0)వరకు రూ.3 కోట్లు, మీనాజీపేట నుంచి బస్వాపూర్ మీదుగా కొక్కం డ. (0/0 నుంచి 0/10)వరకు రూ.3కోట్లు, రాజీవ్ రహదారి పీడబ్ల్యూ రోడ్డు మీదుగా ము ట్రాజ్‌పల్లి (0/0 నుంచి 7/2)వరకు రూ.30 కోట్లు, మర్కూక్ నుంచి నారాయణపూర్ (0/0 నుంచి 10/0) వరకు రూ.23 కోట్లను రోడ్ల అభివృద్ధికి బీఆర్ఎస్ సర్కారు మంజూరు చేయగా, పనులు పురోగతిలో ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలోని హత్నూర మండలం టౌన్ లిమి ట్స్ దౌల్తాబాద్-చిట్కుల్ రహదారి విస్తరణ (కి. మీ 5/3 నుంచి 8/2)రూ.8 కోట్లు, సిద్దిపేట-ఇల్లంతకుంట ఫోర్‌లైన్ రోడ్డు (కి.మీ 22/0 నుంచి 32/0) రూ.82 కోట్లు (రాజన్న సిరిసిల్ల జిల్లా), సిద్దిపేట-ఇల్లంతకుంట ఫోర్‌లైన్ రోడ్డు (కి.మీ 10/0 నుంచి 22/0) రూ.77 కోట్లు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేయడంతో పను లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇక సంగారెడ్డి- నర్సాపూర్-తూప్రాన్ రోడ్డు (కి.మీ 71/0 నుంచి 72/5, 77/4 నుంచి 78/4) (ఆరు వరుసల రహదారి సిద్దిపేట జిల్లాలో) రూ.19 కోట్లు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేయగా, ఈ రోడ్డు నిర్మాణాలకు నిధులు రద్దు చేస్తూ జీవో విడుదల కావడంతో ప్రజలు కాంగ్రె స్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### సిద్దిపేట నుంచి చిన్నకోడూరు వరకే విస్తరణ పనులు

సిద్దిపేట-ఇల్లంతకుంట రహదారి విస్తరణ పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కోత పెట్టింది. చిన్నకోడూరు నుంచి ఇల్లంతకుంట వరకు విస్తరణ పనులకు నిధులను రద్దు చేసింది. దీంతో సిద్దిపేట ఎల్లమ్మగుడి నుంచి చిన్నకోడూరు వర కు మాత్రమే రహదారి విస్తరణ, బ్రిడ్జీల నిర్మాణాలు, డివైడర్ పనులు జరుగనున్నాయి. 0/0 నుంచి 0/10 కిలోమీటరు వరకు మాత్రమే పనులు జరుగుతాయి. చిన్నకోడూరు నుంచి సలెంద్రి, కమ్మర్లపల్లి, మైలారం, అల్లీపూర్, కిష్టాపూర్ జంక్షన్ మీదుగా సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండల కేంద్రం వరకు విస్తరణ పనులకు బ్రేక్ పడింది. సిద్దిపేట-ఇల్లంతకుంట ఫోర్‌లైన్ రోడ్డు (కి.మీ 10/0 నుంచి 22/0) రూ.77 కోట్లు, సిద్దిపేట-ఇల్లంతకుంట ఫోర్‌లైన్ రోడ్డు (కి.మీ 22/0 నుంచి 32/0) రూ.82 (రాజన్నసిరిసిల్ల జిల్లా), కేసీఆర్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కాంగ్రెస్ ప్రభు త్వం ఈ రెండు బిట్లకు సంబంధించిన నిధులు రద్దు చేసింది. ఈ నిధులను ఇతర జిల్లాలకు తరలిస్తూ జీవో విడుదల చేసింది.

### కేసీఆర్ మంజూరు చేశారు.. కాంగ్రెస్ రద్దు చేసింది..

జిల్లా కేంద్రమైన సిద్దిపేట నుంచి రేణుకాఎల్లమ్మ దేవస్థానం, లింగారెడ్డిపల్లి మీదుగా చిన్నకోడూరు నుంచి ఇల్లంతకుంట (రాజన్నసిరిసిల్ల జిల్లా) వరకు ఫోర్‌లైన్ రోడ్డు విస్తరణకు తన్నీరు హరీశ్‌రావు, రసమయి బాలకిషన్ వినతి మేరకు అప్పటి సీఎం కేసీఆర్ నాలుగు లైన్ల రోడ్డుగా మార్చేందుకు రూ.254 కోట్లు మంజూరు చేశారు. వెంటనే రోడ్లు భవనాలశాఖ జీవో నెంబర్ 127ను విడుదల చేసింది. ఈ రోడ్డు నిర్మాణంతో సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాల ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యం కలుగుతుంది. సిద్దిపేట జిల్లాకేంద్రం నుంచి ఎలమ్మ గుడి, లింగారెడ్డిపల్లి మీదుగా మెట్టుబండలు, మండల కేంద్రమైన చిన్నకోడూరు మీదుగా సలెంద్రి, కమ్మర్లపల్లి, మైలారం, అల్లీపూర్, కిష్టాపూర్ జంక్షన్ మీదుగా సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండల కేంద్రం వరకు 32 కిలోమీటర్ల మేర ఈ రహదారి అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ఈ 32 కిలోమీటర్ల మార్గం సిద్దిపేట జిల్లాకేంద్రంతో పాటు చిన్నకోడూరు మండలంలోని 6 గ్రామాలను అనుసంధానం చేస్తూ సిద్దిపేట రూరల్ మండలంలోని బుస్సాపూర్, నంగునూరు మండలంలోని తిమ్మాయిపల్లి రింగు రోడ్డుకు, చిన్నకోడూరు మండలం కిష్టాపూర్ జంక్షన్ వద్ద బెజ్జంకి మండల కేంద్రం అనుసంధానంతో పాటు ఇల్లంతకుంట వరకు జరిగే ఈ మార్గం ఇల్లంతకుంట నుంచి కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలకు అనుసంధానం అవుతుంది. ఒక వరుస నుంచి నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి జరుగుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష కట్టి నిధులు రద్దు చేసి ఇతర జిల్లాలకు మళ్లించి ఈ ప్రాంత ప్రజలకు అన్యాయం చేసింది.


ఇల్లంతకుంటకు వెళ్లే రహదారి

# జిల్లాకు ప్రధాని రిక్తహస్తం

సంగారెడ్డి జిల్లాకు వరాలు ఇవ్వని ప్రధాని నరేంద్రమోదీ
జిల్లా అభివృద్ధి ఊసెత్తని ప్రధాని
నిరాశ మిగిల్చిన పర్యటన
అధికార కార్యక్రమంలో జిల్లా ప్రజాప్రతినిధులకు ఆహ్వానమేదీ..?

సంగారెడ్డి, మార్చి 5(నమస్తే తెలంగాణ): ప్రధాని నరేంద్రమోదీ పర్యటన సంగారెడ్డి జిల్లా వాసులకు నిరాశను మిగిల్చింది. మంగళవారం సంగారెడ్డి జిల్లాలో పర్యటించిన ప్రధాని మోదీ జిల్లాకు ఎలాంటి వరాలు ప్రకటించలేదు. దీంతో ప్రజలతో పాటు బీజేపీ శ్రేణులు సైతం నిరాశకు గురయ్యాయి. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మోదీ వరాలు కురిపించి పార్టీ గెలుపునకు బాటలు వేస్తారని బీజేపీ శ్రేణులు భావించాయి. మోదీ ఎలాంటి వరాలు ప్రకటించక పోవటంతో నేతలు నిరాశకు గురయ్యారు. పటాన్‌చెరు మండలం పటేల్‌గూడ సమీపంలోని ఎల్లంకి ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్స్‌లో మంగళవారం నిర్వహించిన అధికారిక కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని వర్చువల్‌గా రూ.7200 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేశారు. సంగారెడ్డి జిల్లాకు సంబంధించి కంది-రాంసాన్‌పల్లి జాతీయ రహదారి విస్తరణ పనులను జాతికి అంకితం చేశారు. రూ.1298 కోట్లతో చేపట్టనున్న సంగారెడ్డి చౌరస్తా-మదీనగూడ జాతీయ రహదారి ఆరు లేన్ల విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రసంగించిన సమయంలో ఎక్కడా జిల్లాకు వరాలు కురిపించలేదు. జిల్లా అభివృద్ధికి నిధులు ప్రకటించలేదు. జహీరాబాద్ నిమ్జ్‌లో మౌలిక వసతుల కల్పన, పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం నిధులు కేటాయించాల్సి ఉంది. మోదీ నిమ్జ్‌కు నిధుల కేటాయింపు, కొత్త పరిశ్రమల ఏర్పాటుపై ఎలాంటి ప్రకటనలు చేయలేదు. సంగారెడ్డి మీదుగా కొత్త రైల్వేలైన్ ఏర్పాటుకు ప్రజలు ఎదురుచూస్తున్నారు. పటాన్‌చెరు సమీపంలోని నాగులపల్లి నుంచి సంగారెడ్డి-జోగిపేట మీదుగా కొత్త రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని చాలాకాలంగా డిమాండ్ ఉంది. ఈ రైల్వేలైన్‌కు సర్వే పనులు చేపట్టేందుకు రైల్వేశాఖ సుముఖత వ్యక్తం చేసింది. దీనిపై ప్రధాని ప్రకటన చేస్తారని ప్రజలు ఆశించారు. అయితే నిరాశే మిగిలింది. మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు మెట్రోరైల్ విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపైనా మోదీ ఎలాంటి ప్రకటన చేయలేదు. సంగారెడ్డి జిల్లాలో ఐఐఎం లేదా ఇతర కేంద్ర విద్యా సంస్థ, నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. వీటిపైనా ప్రధాని ఎలాంటి ప్రకటన చేయలేదు. బహిరంగ సభలోనూ సంగారెడ్డి జిల్లా అభివృద్ధికి ప్రధాని ఎలాంటి హామీలు, భరోసా ఇవ్వలేదు.

### ప్రధాని పర్యటనలో జిల్లా ప్రజాప్రతినిధులకు దక్కనిచోటు

ప్రధాని నరేంద్రమోదీ పాల్గొన్న అధికార కార్యక్రమంలో జిల్లా ప్రజాప్రతినిధులకు చోటుదక్కక పోవటం చర్చనీయాంశమైంది. ప్రధాని పాల్గొన్న అధికారిక కార్యక్రమంలో ఇటీవలే బీజేపీలో చేరిన జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు అవకాశం దక్కలేదు. అధికారులు ఎంపీ బీబీపాటిల్, చింతా ప్రభాకర్‌కు ఆహ్వానం పలకలేదని తెలుస్తోంది. ఎంపీ బీబీ పాటిల్ ప్రధాని మోదీ పాల్గొన్న బహిరంగ సభకు హాజరయ్యారు. కానీ, అధికార కార్యక్రమంలో పాల్గొనక పోవడం గమనార్హం. మదీనగూడ-సంగారెడ్డి చౌరస్తా ఆరులేన్ల రహదారి విస్తరణ పనులకు మోదీ శంకుస్థాపన చేశారు. ఈ రహదారి విస్తరణ పనులు పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల్లో జరుగనున్నాయి. రెండు నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మహిపాల్‌రెడ్డికి ఈ కార్యక్రమానికి ఆహ్వానించలేదని సమాచారం.

# 'బోరు'మంటున్న అన్నదాత


నెర్రెలు వారిన వరి పొలం

చేగుంట, మార్చి 5: అనధికార కరెంట్ కోతలు, అడుగంటిన భూగర్భ జలాలకు తోడు కాల్వల ద్వారా నీరందక పోవడంతో వరిపైరు ఎండుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మెదక్ జిల్లా నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో రైతు రాచపల్లి దుర్గయ్య పక్క రైతు వద్ద నీటిని పాలుకు తీసుకుని వ్యవసాయం చేసేవాడు. ఇప్పుడు పక్క రైతు పొలం పారక పోవడంతో నీళ్లు ఇవ్వడం లేదు. సాగు చేసిన వరి పంటకు నీళ్లు లేకపోవడంతో బోరు వేయించాడు. మూడు వందల లోతు బోరు డ్రిల్ చేసినా ఉట్టి దుమ్మే వచ్చిందని, చుక్క నీరు రాలేదని దుర్గయ్య భార్య బాలమణి వాపోయింది. చేగుంట మండల పరిధిలోని గొల్లపల్లిలో వరి పొలాలకు నీళ్లులేక ఎండిపోతున్నాయని,ప్రభుత్వం స్పందించి కాలువల ద్వారా నీరందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


నార్సింగి మండలం శేరిపల్లిలో మూడు వందల ఫీట్లు వేసిన బోరు పడలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న రాచపల్లి బాలమణి

# గ్యారెంటీ పథకాలకు డాక్యుమెంట్ల సేకరణ

కలెక్టర్లతో విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్ఎం రిజ్వీ


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మెదక్ కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : ఆరు గ్యారెంటీల లబ్ధిదారుల ఎంపికకు అవసరమైన డాక్యుమెంట్లు సేకరించి ప్రజాపాలన సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలని విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్ఎం రిజ్వీ సంబంధిత అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఆయన జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మెదక్ ఐడీవోసీ నుంచి అదనపు కలెక్టర్ రమేశ్‌తో కలిసి కలెక్టర్ రాజర్షి షా వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజ్వీ మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి గ్యారెంటీ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. ప్రతి మండలంలోని ఎంపీడీవో కార్యాలయం, మున్సిపాలిటీల్లో ప్రజా పాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, తెల్ల రేషన్‌కార్డు వివరాలు, ఆధార్ కార్డు వివరాలు, గ్యాస్ కనెక్షన్ నెంబర్, విద్యుత్ మీటర్ నెంబర్ వివరాలు లింక్ ఉన్న దరఖాస్తుదారులకు ఇప్పటికే ప్రభుత్వం 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. గృహజ్యోతి కింద ఎంపికైన లబ్ధిదారులకు జీరోబిల్లులు పంపిణీ చేస్తున్నామని, ప్రజా పాలన దరఖాస్తు సమయంలో వివరాలు సరిగ్గా నమోదు చేయని వారు ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా సమర్పించవచ్చని సూచించారు. ఒక తెల్ల రేషన్ కార్డుపై ఒక గ్యాస్ కనెక్షన్, ఒక విద్యుత్ మీటర్ కనెక్షన్‌కు మాత్రమే గ్యారెంటీ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా జిల్లా పరిస్థితుల గురించి వివరించారు.

# ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ గరీమ అగ్రవాల్

సిద్దిపేట అర్బన్, మార్చి 5: సిద్దిపేట జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, 23 ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తెలిపారు. అంతకుముందు గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల లబ్ధిదారుల కోసం ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి లబ్ధిదారుల నుంచి గుర్తింపు కార్డులను సేకరించి డాటా కరెక్షన్ చేయాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర స్థాయి అధికారులు జిల్లా కలెక్టర్లు, అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజల నుంచి సంబంధిత గుర్తింపు కార్డులు సేకరించి, నిర్దేశిత సమయంలోగా అవసరమైన వారి డాటా సరి చేస్తామని తెలిపారు. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకం ద్వారా లబ్ధిపొందేందుకు అర్హత గల గ్రామీణ ప్రాంత లబ్ధిదారులు ఎంపీడీవో కార్యాలయాలు, పట్టణ ప్రాంతాల లబ్ధిదారులు మున్సిపల్ కార్యాలయాల్లో ఆధార్, రేషన్ కార్డు, విద్యుత్ బిల్లు, గ్యాస్ పాస్ బుక్‌లతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన జిల్లా ప్రజలకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ గరీమాఅగ్రవాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నేడు తూప్రాన్ మున్సిపల్ అవిశ్వాస సమావేశం

తూప్రాన్, మార్చి 5: మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ అవిశ్వాస సమావేశాన్ని నేడు నిర్వహించనున్నారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్ గౌడ్‌పై 11 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తూప్రాన్ మున్సిపల్‌లో మొత్తం 16 మంది కౌన్సిల్ సభ్యులు ఉండగా, బీఆర్ఎస్ నుంచి 11 మంది, కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరు, స్వతంత్రులు ఇద్దరు ఉన్నారు. కొంత కాలంగా మున్సిపల్ చైర్మన్‌తో వైస్ చైర్మన్ సహా కొంత మంది సభ్యులకు విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో వైస్ చైర్మన్ సహా ఎనిమిది మంది సభ్యులు కాంగ్రెస్‌లో చేరారు. ఫిబ్రవరి 12న అవిశ్వాస తీర్మాన నోటీసును కలెక్టర్‌కు అందజేశారు. తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సమక్షంలో బుధవారం అవిశ్వాస సమావేశం నిర్వహించనున్నారు. మంగళవారం తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినొద్దీన్, సీఐ కృష్ణ, ఎస్ఐ శివానందంతో కలిసి ఆర్డీవో పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, లైవ్ వీడియో రికార్డింగ్‌లతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలకు ఆదేశించారు.

# ఘనపూర్ ఆయకట్టుకు సింగూరు జలాలు

పుల్కల్, మార్చి 5: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టు నుంచి ఐదో విడతలో భాగంగా మంగళవారం మెదక్ జిల్లా ఘనపూర్ ఆయకట్టుకు నీటి పారుదల శాఖ అధికారులు సింగూరు జలాలను విడుదల చేశారు. ప్రాజెక్టు సమీపంలోని జలవిద్యుత్ కేంద్రం నుంచి 1460 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశామని జేఈఈ మహిపాల్ రెడ్డి తెలిపారు. మత్స్యకారులు, గొర్రెల కాపరులు నది పరీవాహక ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 20.668 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.


జల విద్యుత్ కేంద్రం గేటు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న జలాలు